


# ఉత్తిష్టంతు

**ము**ళ్ళపూడి వెంకట్రమణ కథల్రాయటం మానేసాక ఆ తరం వెళ్ళిపోయి రామకృష్ణాబీచ్ వెలవెలబోతూంది. వైజాగ్‌లో అబ్బాయిలూ అమ్మాయిలూ సుబ్బరంగా చదువుకుంటున్నారు. రాధలు ముగ్గులేయటం మానేశారు. బామ్మలు బాబాయిలకి డబ్బులివ్వటం ఆపుచేశారు. తెలుగుతనం పారిపోయి ప్లిమత్‌కార్లూ యమా సస్పెన్సులూ వచ్చేశాయి.

అటువంటి సాయంత్రం జరిగిందీ సంఘటన.

అసలు శ్రీధరం బాగానే వుంటాడు. కొనదేలిన ముక్కు, రెండ్రోజులకోసారి గీసే గడ్డం, పొడుగ్గా చువ్వలా ఉంటాడు.

శార్వాణి ఆఫీసులో చేరేముందే బామ్మ చెప్పింది. "ఓసే పిల్లా, కాలేజిలో చదువుకునట్టు కాదు. ఆఫీసులో జాగ్రత్తగా వుండు అల్లరి చేయకు" అని శార్వాణి బుద్ధిగా తలూపింది. ఆ అమ్మాయికి ఆఫీసు క్రొత్తగా ఏం కనపడలేదు. అంతవరకూ యూనివర్శిటీలో చదివింది. ఇప్పుడు ఆఫీసుకూడా అదే ఏరియా అందువల్ల ఆఫీసు కొత్తగా ఏమీ లేదు. అందులోనూ సూపర్నింటెండెంటు మంచాయన. ఇద్దరు ముగ్గురు అమ్మాయిలుకూడా వున్నారు. అన్నింటికన్నా చిత్రమేమిటంటే ఆఫీసులో అందరూ దాదాపు చిరునవ్వుతో సంతోషంగా వున్నారు. ఒక కుటుంబంలా వున్నారు.

శార్వాణికి ఆఫీసు బాగా నచ్చింది.

ఇంటిదగ్గర బయల్దేరితే బీచ్ ప్రక్కనుంచే పదినిముషాల నడక. దూరంగా యూనివర్శిటీ క్వార్టర్సు.

ఆఫీసంటే పెద్దహాలు కాదు. ఏదో ప్రైవేటు బిల్డింగు అద్దెకి తీసుకున్నారు. మధ్యలో హాలుంది. అందులో సూపర్నెంటెండెంటు కూర్చుంటాడు. మరో ఆరుగురు వుంటారు. మిగతావి గదులు. ఒక గదిలో శార్వాణి టేబులుంది. పక్క టేబులు శ్రీధరానిది. అతడు శలవులో వున్నాడు.

ఆఫీసులో వున్న మిగతా ముగ్గురమ్మాయిల్లో జయంతి బాగా నచ్చింది శార్వాణికి. ఆఫీసు విశేషాలన్నీ ఆ అమ్మాయే శార్వాణికి చెప్పింది. అదే ఆఫీసులో వున్న కమలకీ ఈ శ్రీధరం బీరకాయ పీచు వరసలో అన్నయ్య అవుతాడు. ఇంకో విషయం ఏమిటంటే ఈ సదరు శ్రీధరాన్ని ఆఫీసులో అందరూ ప్రేమిస్తారు. అలా అన్చెప్పి అతడేం రచయిత కాడు. క్రికెటు ప్లేయరూ కారు. కనీసం నాటకాలు కూడా వెయ్యడు.

కానీ అందరి తలలో నాలుకలా వుంటాడు. 'ప్చ్! అతడు లేకపోయే సరికి ఆఫీసంతా డల్‌గా వుందోయ్' అని జయంతే చాలాసార్లు అంది. అటువంటి శ్రీధరం అంటే శార్వాణికి ప్రస్తుతం పీకల్దాకా కోపం వుండటానికి కారణం కనుక్కోవాలంటే నాల్రోజులు వెనక్కి వెళ్ళాలి.

టేబుల్ ముందు కూర్చొని పనిచేసేకుంటూంది ఆమె. లంచ్ అవర్ దగ్గిర పడటంతో బైట నిశ్శబ్దంగా వుంది. ఆ గదిలో పక్క టేబిల్ మీద, ఫైళ్ళు గుట్టలుగుట్టలుగా పడివున్నాయి. ఆ టేబిలు శ్రీధరానిది.

"వచ్చాక ఇంత వర్కు ఎలా పూర్తిచేస్తాడో ఏమో' అంది జయంతి వాటికేసి చూస్తూ.

"మనలాగా అపసోపాలు పడుతూ మాత్రం చెయ్యడ్లే" అంది కమల తన కజిన్‌బ్రదర్ వెనకేసుకొస్తూ.

ఆఫీసుకు రాగానే ఒకసారి ఆ టేబుల్‌కేసి చూసి, తన పనిలో కూర్చోవటం అలవాటయింది శార్వాణికి.

ఆ రోజూ అలాగే చేసింది.

లంచ్ అవర్‌కి ఇంకో అయిదునిముషా లుందనగా అతడు ప్రవేశించాడు. ఆమె

తలెత్తి "ఏం కావాలి?" అంది.

అతడు ఒక క్షణం దెబ్బతిన్నాడు. తడబడి "కోళ్ళు" అన్నాడు.

ఉలిక్కిపడి "కోళ్ళా?" అంది. ఆమె పనిచేసేది ఎరువుల ఆఫీసు. "కాదు, ఫీడ్" అన్నాడు.

ఆమె అతడివైపు కాస్త జాలిగా చూసింది. చదువుకున్నవాడిలాగే కనబడుతున్నాడు. బహుశ వ్యవసాయంలో దిగాక చదువు మర్చిపోయి వుంటాడు.

"ఇది పౌల్ట్రీ ఫీడ్ (కోళ్ళకి వేసే ఆహారం అమ్మే) ఆఫీసు కాదు. మెన్యూర్స్ డిస్ట్రిబ్యూషన్ - అంటే ఎరువుల పంపిణీ ఆఫీసు" అంది ఒక గ్రామీణ వ్యవసాయ విస్తరణాధికారిలా వివరిస్తూ.

"అలాగా" అన్నాడు అతడు తలపైకెత్తి పైన ఫానుకేసి, పక్కనున్న చెక్క బీరువాలకేసి చూస్తూ.

"మీకు కోళ్ళఫీడ్ కావాలంటే జగదంబా టాకీస్ దగ్గరికి వెళ్ళండి. అక్కడుంది.'

"మరిక్కడేమి అమ్ముతారు?"

"ఇది ఎరువుల ఆఫీసు"

"నాకు బీరకాయలకి వేసే ఎరువుకావాలి. అలాగే వంకాయలక్కూడా" అన్నాడు అమాయకంగా.

"ఇది అమ్మేషాపు కాదు. కేవలం డిస్ట్రిబ్యూషన్ ఆఫీసు. మీకు బీరకాయల ఎరువులు కావాలంటే యూనివర్శిటీ సైకాలజీ డిపార్టుమెంటు పక్క సందులోంచి వెళ్ళండి. దొరుకుతుంది' ' అంది.

"మరి వంకాయలకి?" అన్నాడు.

"మీకెంత పొలముంది?" అని అడిగింది.

"ఓ ఇరవై ఎకరాలు సముద్రం ప్రక్కనే" అన్నాడు.

"వంకాయలకీ బీరకాయలకీ ఒకటే" అంది ఓపిగ్గా.

"బంగాళదుంపలకి?" అన్నాడు.

కొంచం విసుగేసింది. 'ఆ! వాటిక్కూడా" అంది.

"భూమిలోపల వుండే వాటికి, భూమి బయట వుండేవాటికి ఒకే ఎరువులు ఎలా ఉపయోగపడతాయి? ఫార్మర్ రిక్వైర్స్ నైట్రోజన్ అండ్ ది లేటర్ పొటాషియం" అన్నాడు. ఆమె అదిరిపడింది. ఇంతలో కమల లోపలికి వస్తూ "హాయ్ అన్నయ్యా, ఎప్పుడొచ్చావురా?' ' అని అరిచింది.

దాదాపు అయిదునిముషాల్లో ఈ సంగతి ఆఫీసు అంతా పాకిపోయింది. తను శ్రీధరాన్ని మోతుబరి అని అనుకోవటం, బంగాళాదుంపలకీ, వంకాయలకీ ఒకే ఎరువు వేయమని సలహా ఇవ్వటం - కథలు కథలుగా అందరూ చెప్పుకు నవ్వుకుంటున్నారని శార్వాణి గ్రహించింది.

ఇంతకుముందు ఆ అమ్మాయిని ఎవరూ పట్టించుకునేవారు కాదు. కొత్తగా వచ్చిన అమ్మాయి కదా అని మొహమాటంగా, గౌరవంగా వుండేవారు. కానీ ఇప్పుడు తను క్యాంటిన్‌లోకి ప్రవేశించగానే అందరూ ముసిముసిగా నవ్వటం ఆమె కళ్ళబడుతూంది. ఈ కోపమంతా శ్రీధరంమీదికి తిరిగింది. అతడు మాత్రం ఏవీ పట్టనట్టు తన పని చూసుకుంటున్నాడు.

ఈ గొడవ ఇక్కడితో ఆగేదే - రెండ్రోజుల తరువాత అది జరకకపోతే -

- ఆ రోజు అయిదింటికి సీటు కట్టేసి లేచింది. పక్కసీట్లో శ్రీధరం ఇంకా పనిచేసుకుంటున్నాడు. అతడు ప్రతిరోజూ ఆరూ, ఆరున్నర వరకూ వుంటాడు. ఉన్నంతసేపూ సిన్సియర్‌గా చేస్తాడు. ఆ విషయంమాత్రం వొప్పుకుని తీరాలి.

ఆమె వెళ్ళబోతుంటే "ఏమండీ కాస్త ఈ ఉత్తరం పోస్టుచేస్తారా" అంటూ ఓ కార్డు యిచ్చాడు.

"మీరు వెళ్తూ వేసుకోవచ్చుగా. ఇంత సాయంత్రప్పూట ఎవరు తీస్తారు పోస్టు" అందామనుకుని బావోదని తీసుకుంది.

బీచ్ ప్రక్కనే నడుస్తూ దూరంగా ఐస్‌క్రీమ్‌షాప్ పక్కన పోస్టుబాక్స్‌ని చూసింది అటువెళ్తూ యధాలాపంగా కార్డుకేసి చూసి ఉలిక్కిపడింది. అడ్రస్ అని వున్నచోట -

వెంకటేశ్వర్రావ్

కేరాఫ్ అలివేలు మంగతాయారు

ఏడుకొండలు,

తిరుపతి.

అని వుంది. శార్వాణికి మతిపోయింది. కార్డుమీద ఏముందా అనుకుంటూ, సంస్కారాన్ని కాస్త అవతలపెట్టి చదివింది.

అదిగో అప్పుడే ఆమె మొహం ఎర్రబడింది. ముక్కుపుటాలు అదురుతూ వుండగా 'డామిట్' అనుకుంది మనసులో.

మొదట చేతిలో కార్డు చింపేద్దామా అనుకుందికానీ దూరం నుంచి అతడు చూస్తున్నాడేమో అని భయంవేసింది. ఒక భయంకరమైన క్రిమిని వేళ్ళతో పట్టుకున్నట్టు పట్టుకుని దాన్ని బాక్సులో వేసింది.

ఆ కార్డులో వ్రాసింది తల్చుకున్నకొద్దీ ఉక్రోషం పెరిగిపోయింది ఆమెకి. అందులో ఎక్కువ వాక్యాలుకూడా లేవు.

"వెంకటేశ్వరస్వామీ. మా ఆఫీసులో ఒక అమ్మాయి చేరింది. ఆమెను చూస్తున్న కొద్దీ ఉత్థిష్టంతే అనుకో . . ." అని వుంది అంతే.

ఆ మరుసటిరోజే ఆఫీసుకు వెళ్ళినప్పుడు తన మొహంలో ఎలాంటి భావమూ కనిపించకుండా వుండటానికి (అంటే తనా ఉత్తరం చదివినట్టు అతనికి తెలియకుండా వుండాలన్నట్టు) ఆమె చాలా కష్టపడాల్సివచ్చింది. ఆ కష్టపడే తాపత్రయంలోనే దొరికిపోయింది.

"నిన్న వుత్తరం పోస్టుచేశారా" అని అడిగాడు చాలా క్యాజువల్‌గా.

"వే . . . వేశాను. ఎందుకువెయ్యను?"

"ఆహాఁ"

"ఉత్తరం ఏమిటి?" జయంతి అడిగింది.

"ఏంలేదు ఏంలేదు" అని ఏదో పనివున్నట్టు అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది శార్వాణి. ఆ సాయంత్రం ఆమె సీటు కట్టేసి వెళ్ళబోతుంటే వెనుకనుంచి నెమ్మదిగా 'ఉత్థిష్టంతు' అని వినిపించింది.

చివుక్కున వెనుతిరిగి చూసింది. శ్రీధరం ఫైల్లో సీరియస్‌గా చూసుకుటున్నాడు. విసురుగా దగ్గరికి వెళ్ళి "ఏవన్నారు మీరు?" అంది.

"ఏవన్నాను"

"ఇప్పుడేదో అన్నారు!"

"అప్పుడప్పుడు నాలో నేను అలా మాట్లాడుకోవడం అలవాటు"

"అంతేకానీ నన్ను ఏమి అన్లేదంటారు"

"మైగాడ్ ! కొంపదీసి 'ఉత్థిష్టంతు' అన్నానా ఏమిటి?" అన్నాడు. ఆమె గతుక్కుమని "అదంటే నన్నన్నట్టా" అంది నిలదీస్తున్నట్టు.

"సారీ అండీ, మీరు వింటున్నారు అనుకోలేదు" అన్నాడు మరింత అమాయకంగా మొహంపెట్టి. ఇదంతా తనని ఏడిపించటం కోసం అని అర్థమై అక్కణ్నుంచి విసవిసా నడిచి వెళ్ళిపోయింది.

శార్వాణి తమ్ముడు లిటరేచర్ బి.యే. వాణ్ణి 'ఉత్థిష్టంతు' అంటే ఏమిట్రా" అని అడిగింది.

"ఉత్తిష్టంటా?" అన్నాడు వాడు.

"ఉత్తిష్టంటు కాదురా. ఉత్థిష్టంతు"

"డిక్షనరీ చూడు. ఉత్తిష్టంటు అయి వుంటుంది. నువ్వు సరిగ్గా వినివుండవు.

"వెధవా, ఆమాత్రం నాకు తెలీదా? నిన్ను అడగటం దేనికి?"

"ఇంగ్లీషయితే అడుగు. టకామని చెప్పేస్తాను" అన్నాడు. నిఘంటువు వెతికింది. కానీ తనకి కావల్సింది దొరకలేదు. విసుగ్గా డిక్షనరీ పక్క పడేసింది.

ఆ మరుసటిరోజు యధాపంగా కమల్తో "ఉత్థిష్టంతు అంటే ఏమిటి" అని అడిగింది. కమల ఉలిక్కిపడి ఆమెవైపు చూసి కళ్ళనీళ్ళు పెట్టుకుంది. అకస్మాత్తుగా ఆమెలో ఆ మార్పుచూసి శార్వాణి కంగారుపడి "ఏం జరిగింది" అంది.

"క్షమించు, నే నెప్పుడూ ఆ మాట నీ గురించి అన్లేదు?" అంది కమల.

"అంటే మిగతా వాళ్ళందరూ నా గురించి అనుకుంటున్నా రనేగా . . . ఆ శ్రీధరాన్ని, ఆ రాక్షసుడిని ముక్కలుముక్కలుగా కోసినా పాపంలేదు" అంది కసిగా.

తన అన్నయ్యని అన్ని మాటలన్నదుకు కమలకి బాగా కోపం వచ్చింది. "నువ్వు నిజంగా ఉత్థిష్టంతువే" అంది కోపంగా.

శార్వాణి చప్పున తన కోపం మర్చిపోయి "అయితే నీకు తెలుసా దాని అర్థం" అని నిలదీసింది.

"ఉహూ! నాకు తెలీదు ఎందుకో నిన్ను చూస్తుంటే అలా అనిపించింది" అంది కమల.

ఆవిధంగా ఆరోజునుంచీ శార్వాణికి ఆఫీసు నరకమయింది. అప్పటి వరకూ ఆఫీసంటే ఎంతో ఉత్సాహంగా వుండేది. ఇప్పుడు వెళ్ళాలంటే భయంగా వుంది. ఏ నలుగురు చేరినా తనగురించే అనుకుంటున్నారు అనిపించేది. రకరకాల కంఠాల్తో చుట్టూ ఒక స్వరం (నిశ్చయంగా శ్రీధర్‌దే) ఉత్తిష్టంతు-ఉత్తిష్టంతు- అని వినిపించేది.

ఈ బాధ భరించలేక ఒకరోజు శ్రీధరాన్నే నిలదీసింది. ఇది న్యాయం కాదు అని తిట్టిపోసింది.

శ్రీధర్ చలించలేదు. "ఇంతకీ మీకేం కావాలి మేడమ్?" అని అన్నాడు తాపీగా.

"ఉత్తిష్టంతుకి అర్థం"

"మైగాడ్, అది భార్యలగ్గానీ చెప్పకూడదే. అదీ - రహస్యంగా చెవిలో . . ." చిలిపిగా నవ్వుతూ అన్నాడు.

అప్పటికే శార్వాణి మొహం కందిపోయింది. అంతకుముందే సూపర్నెండెంటు ఇంకో యు.డి.సి.తో 'ఆ ఫైలు ఉత్తిష్టంతుగారి దగ్గిర వుందేమో చూడవోయ్' అని అనటం వినిపించి, తన పేరు ఎంత సర్వసామాన్యమైపోయిందో తెలుసుకున్న శార్వాణి ఒక దుఃఖం పట్టలేక పోయింది.

ఇంటి కెళ్ళగానే తండ్రితో "నేను ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేస్తున్నా నాన్నా" అంది. "ఇస్తే ఇచ్చావ్‌గానీ అమ్మాయ్ అదేమిటి శ్రీధరాన్ని ఉత్తిష్టంతుకి అర్థంచెప్పమని అడిగావట. తప్పుకాదూ. నీకు ఉద్యోగం మానేసి పిల్లల్ని కనాలి అని వుంటే మాకు చెప్పాలిగాని అలా అడిగెయ్యటమే" అన్నాడు గంభీరంగా.

శార్వాణి తెల్లబోయి "దాని అర్థం నీకు తెలుసా నాన్నా" అంది.

"నాకు తెలీదమ్మాయ్. ఇప్పుడే శ్రీధర్ బామ్మగారు వచ్చివెళ్ళారు. గుంటూరులో మనింటిపక్కే వుండేవార్లే. నువ్వు ఇలా అడిగావనీ, ఇంక ఆగితే లాభం లేదని తాంబూలాలు పుచ్చేసుకుందామని అన్నారు. శ్రీధర్‌కేం చక్కటి కుర్రాడు. నాకేమీ అభ్యంతరం లేదన్నాను' 'అని తల తిప్పేసరికి కూతురు అక్కడలేదు.

ఆపై నెల్రోజులకి వాళ్ళ పెళ్ళి జరిగిపోయింది. మంగళసూత్రం కడుతూ వుంటే జయంతి వంగి చెవిలో "నీ ఉత్తిష్టంతుకి కృతజ్ఞత చెప్పుకోవే. కన్నెపిల్లలందరూ పటం కట్టించి పెట్టుకోవలసిన పదం అది. కానీ కట్నం లేకుండా పెళ్ళిచేయించి పెడుతుంది" అంది.

ఆ రాత్రి మల్లెల మధ్యన -

దగ్గరకి తీసుకోబోతున్న శ్రీధరాన్ని ఆపి "ముందిది చెప్పండి. ఉత్తిష్టంతుకి అర్థం ఏమిటి" అంది. అతడో క్షణం తెల్లబోయి సర్దుఉని "ఛా, ఇప్పుడా?" అన్నాడు తేలిగ్గా.

"ఉహూ, అది చెప్తేగానీ నేను మాట్లాడను"

"డిక్షనరీ చూడలేకపోయావా?"

"చూశాను. లేదు."

ఉత్తిష్ఠంతు చూసివుంటావు. లేకపోతే ఉత్థిష్టంతు చూసివుంటావు."

"మరేం చూడాలి?"

"ఉత్థిష్ఠంతు" అని ఆమె బయల్దేరబోతుంటే కంగారు పడి "అరెరె, అదేమిటి ఇప్పుడే వెళ్తావా? బైట గొళ్ళెం పెట్టి వుంటారు" అన్నాడు.

"అది తెలుసుకోక పోతే నా మనసు మనసులో వుండదు."

"అంతా అయ్యాక చెప్తానేం."

"ఊహూ."

ఇక లాభంలేదన్నట్టు శ్రీధర్ ఆమెని దగ్గరికి తీసుకొని చెవిలో నెమ్మదిగా "ఉత్థిష్ఠంతు - అంటే" అంటూ అర్థం చెప్పాడు.

ఆమె మొహం ఎర్రమందారం అయింది. కళ్ళు సిగ్గుతో వాలి పోయాయి. భుజం దగ్గర రక్తం వచ్చేలా గిల్లుతూ "ఛీ" అంది.

❀ ❀ ❀

**(పల్లకి - 1988)**